# నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు

సూర్యాపేట, జూన్ 19 : నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు అన్నారు. సోమవారం హరితోత్సవంలో భాగంగా జడ్పీ కార్యాలయంలో మొక్కలు నాటి నీరు పోసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని 8 విడుతలుగా చేపట్టింద న్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, జడ్పీ సీఈఓ సురేశ్, జడ్పీటీసీ పుల్లారావు పాల్గొన్నారు.



సూర్యాపేట : జిల్లా పరిషత్ కార్యాలయంలో మొక్క నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు



సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న సీఐ రాజశేఖర్

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట సిటీ : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. హరితోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లోని మైదానంలో సిబ్బంది, అధికారులతో కలిసి సామూహికంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, రవి, ఏఓ సురేశ్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ పాలనలో పచ్చగా మారిన పల్లెలు

సూర్యాపేట రూరల్ : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పచ్చని వాతావరణంలో పల్లెలు విరజిల్లుతున్నాయని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లకాంపాడ్‌లో నిర్వహించిన హరితోత్సవంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీషతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీఓ వెంకన్న, ఎంపీఈ వెంకన్న, ఉప సర్పంచ్ సైదులు, కిరణ్మయి, స్వప్న, మమత, ప్రవంతి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం



సూర్యాపేట రూరల్ : తాళ్లకాంపాడ్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం



చివ్వెంల : ఉండ్రుగొండలో హరితోత్సవంలో మొక్క నాటుతున్న ఎంపీపీ కుమారిబాబూనాయక్, అధికారులు



ఆత్మకూర్.ఎస్ : పుప్పాలగూడెంలో మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్త శోభను సంతరించుకున్న అర్వపల్లి మండలంలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల

# చక్క'బడి'న చదువులు

- స్వరాష్ట్రంలో పేదలకు కార్పొరేట్ స్థాయి చదువులు
- విద్యపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం బోధన
- ఉచితంగా వర్క్‌బుక్స్, నోట్ పుస్తకాల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 152 పాఠశాలల్లో గ్రంథాలయాలు
- మన ఊరు-మన బడిలో 329 పాఠశాలలు ఎంపిక
- నేడు విద్యా దినోత్సవంలో భాగంగా 26 పాఠశాలల భవనాలు ప్రారంభం

సూర్యాపేట అర్బన్ జూన్ 19 : ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో ప్రభుత్వ బడుల రాత మారింది. సీఎం కేసీఆర్ మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించడంతో సర్కారు బడుల్లో అడ్మిషన్ల కోసం క్యూలు కడుతున్నారు. ఇంకా చెప్పాలంటే పాఠశాలల్లో సీట్ల కోసం పైరవీలు చేస్తున్నారంటే అతిశయోక్తి లేదు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పిల్లలకు అందని ద్రాక్షలా మారిన ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా 152 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రంథాలయానికి 252 పుస్తకాలను ప్రభుత్వం సమకూర్చింది. మన ఊరు-మన బడిలో భాగంగా జిల్లాలో 329 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటికే 26 పాఠశాలల్లో పనులను పూర్తి చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలోని 997 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 65,769 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ అందించనున్నారు. జిల్లాలోని 645 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 655 ట్యాబ్‌లను అందించడం జరిగింది. ఈ ట్యాబ్‌లతో పాఠశాల సమాచారాన్ని అందరికి అందుబాటులో ఉంచి పారదర్శకత పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## చెల్లని చెక్కు కేసులో మహిళకు జైలు శిక్ష

సూర్యాపేట లీగల్, జూన్ 19 : చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సూర్యాపేట ప్రధాన ప్రథమశ్రేణి న్యాయమూర్తి సురేశ్ సోమవారం తీర్పునిచ్చారు. సూర్యాపేట పట్టణానికి చెందిన మదను పద్మ, తాళ్లకాంపాడ్‌కు చెందిన సైదమ్మ స్నేహితులు. సైదమ్మకు అవసరం నిమిత్తం పద్మ వద్ద 2013 జనవరి 27న రూ.2లక్షలు అప్పు తీసుకున్నారు. తరువాత డబ్బులు ఇవ్వకుండా చెక్కు ఇచ్చారు. బ్యాంకులో చెక్కు వేయగా ఖాతాలో డబ్బులు లేకపోవడంతో చెల్లలేదు. దీంతో బాధితురాలు లాయర్ నోటీస్ పంపించినప్పటికీ సైదమ్మ స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో సైదమ్మకు రూ.4లక్షల జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.



నెమ్మికల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ పుష్ప

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్మకూర్.ఎస్, జూన్ 19 : మండలంలోని ఏనుబాముల, కోటినాయక్‌తండా, పాత సూర్యాపేట, నెమ్మికల్, పాతర్లపహాడ్, ఇస్తాలాపురం, ముక్కుడుదేవులపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తాసీల్దార్ పుష్ప, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు విధానంపై చర్చించారు. వారి వెంట ఆర్ఐ అంజయ్య ఉన్నారు.

# సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు



మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతులమీదుగా హరితహారం రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ రామాంజులరెడ్డి

బొడ్రాయిబజార్, జూన్ 19 : సూర్యాపేట మున్సిపాలిటీకి హరితహారం కార్యక్రమానికి గానూ రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చిన విషయం విధితమే. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన హరితోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతులమీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ పి.రామాంజులరెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో మున్సిపాలిటీకి అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒంటెద్దు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్

## ఆర్థిక సాయం

బొడ్రాయిబజార్, జూన్ 19 : పట్టణంలో గాయపడిన, మృతి చెందిన పలువురు టెక్నీషియన్ల కుటుంబాలకు సూర్యాపేట ప్రైవేట్ ఎలక్ట్రిషన్ టెక్నీషియన్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్ సోమవారం రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, అనారోగ్య సమస్యలు తలెత్తితే సీఎంఆర్ఎఫ్‌తో పాటు ఎల్ఓసీలు అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారుడు కటారి రాము, పిట్టల లింగయ్య, అధ్యక్షుడు బొమ్మగాని వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఇరుగు సంజీవ, కోశాధికారి రాజబోయిన వెంకటేశ్, కౌన్సిలర్ మడిపల్లి విక్రమ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.